సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం ⧸ 27 ⧸ జూన్ ⧸ 2023



ధర.. దడ

ఇప్పటికే నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్న ప్రజలకు కూరగాయలు సైతం షాకిచ్చాయి.

వివరాలు 8లో ▸



ఖాళీ స్థలాలపై రియల్ కన్ను

రాష్ట్రంలోని ఖాళీ స్థలాలపై రియల్ వ్యాపారుల కన్ను పడిందని వీరయ్య అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /22.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడతాయి. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘ప్రజావాణి’ వినతులపై అలసత్వం వద్దు

నాగర్‌కర్నూల్: ప్రజావాణికి వచ్చే వినతులపై అలసత్వం వహించొద్దని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రజావాణికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజావాణి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజావాణిలో 284 ఫిర్యాదులు అందాయని, అందులో రెవెన్యూ శాఖ ధరణికి సంబంధించి 242, డీపీఓ, నాగర్‌కర్నూలు మున్సిపాలిటీ, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖలు డీఈఓ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖల కార్యాలయాలకు చెందినవి 42 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ధరణికి సంబంధించి పలు ఫిర్యాదులను ఆయన వెంటనే పరిష్కరించారు. డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరగా పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఎస్పీ నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవరిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పోలీస్ ప్రజావాణిలో 10 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

దేవుని భూమి కబ్జాపై ఫిర్యాదు

కందనూలు: మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు శివారులో ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వే నం.362లో ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన మాన్యం భూమిని కబ్జా చేసి కొందరు అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రభాకర్, లక్ష్మీకాంతం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాదాయ శాఖ అధికారులు గతంలో ఈ భూమి ఆక్రమణకు గురికాకుండా బౌండరీలు నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారన్నారు. కానీ, ఇటీవల జరిగిన సీఎం కేసీఆర్ సభ కోసం భూమిని చదును చేశారని, దానిని ఆసరా చేసుకొని కొందరు భూమి ఆక్రమించుకొని దర్జాగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. రూ.కోట్లు విలువ చేసే దేవాదాయ శాఖ భూమిని కాపాడాలని కోరారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: మాతాశిశు మరణాలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాతాశిశు మరణాలపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మాతాశిశు మరణాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రసవ సమయంలో హైరిస్క్ కేసులు ఉన్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమోహన్, వైద్యులు విజయకుమార్, సుప్రియ, అనిత, పాండురంగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంకల్పంతోనే సభ విజయవంతం

కందనూలు: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన నవ సంకల్ప సభ విజయవంతంపై పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీప్‌చారి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు. కొన్ని శక్తులు సభను భగ్నం చేయాలని చూసినా మొక్కవోని దీక్షతో వేలాదిగా తరలివచ్చి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభను విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభతో రాష్ట్ర, జిల్లాస్థాయిలో చర్చ జరుగుతుందని, సార్వత్రిక ఎన్నికలకు ఈ సభ ద్వారా తమ నాయకుడు నడ్డా, బండి సంజయ్‌లు సమరశంఖం పూయించారన్నారు. తమ పార్టీకి జిల్లాలో ఒక్క ప్రజాప్రతినిధి లేకపోయినా రెండు జాతీయ ప్రాజెక్టులు తీసుకొచ్చామని, అధికారంలోకి వస్తే జిల్లా భవిష్యత్తే మారిపోతుందన్నారు. సమావేశంలో నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, రాము, సుదర్శన్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం కుదిరింది

కాంగ్రెస్ గూటికి ఉమ్మడి జిల్లా సీనియర్ నేతలు

- ఉత్కంఠకు తెరదించిన మాజీ మంత్రి జూపల్లి, గురునాథ్‌రెడ్డి
- వచ్చేనెల 14న హస్తం పార్టీలో చేరుతున్నట్లు ప్రకటన
- వారి బాటలోనే ఎమ్మెల్సీ తనయుడు రాజేశ్‌రెడ్డి, వనపర్తి జిల్లా బీఆర్‌ఎస్ నేతలు



సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సీనియర్ నేతలు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డితో సహ పలువురు ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుమారుడు రాజేశ్‌రెడ్డితో పాటు వనపర్తి జిల్లాకు ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి తదితర నేతలు సైతం కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు సోమవారం ఢిల్లీ వేదికగా పార్టీ పెద్దల సమక్షంలో వెల్లడించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నేతల పార్టీ మార్పుపై కొన్ని నెలలుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. జూలై 14న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో వీరంతా పార్టీలో చేరనున్నట్టు ప్రకటించడంతో కాంగ్రెస్‌లో నూతనోత్సాహం నెలకొంది.

సొంత బలాన్ని ప్రదర్శించేలా..

మాజీ మంత్రి జూపల్లి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, వనపర్తి జిల్లా పెద్దమందడి ఎంపీపీ తూడి మేఘారెడ్డి, వనపర్తి ఎంపీపీ సానే కిచ్చారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్‌రెడ్డి, ఇతర నేతలంతా ఆదివారం సాయంత్రమే ఢిల్లీకి బయలుదేరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ ఠాక్రే సమక్షంలో సోమవారం చర్చలు జరిపి తామంతా పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. అయితే ఢిల్లీలోనే పార్టీ పెద్దల సమక్షంలో వీరంతా పార్టీ కండువా కప్పుకుంటారని భావించగా, స్థానికంగానే ప్రజల మధ్య పార్టీ మారాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జూలై 14 కొల్లాపూర్ వేదికగా భారీ బహిరంగసభను నిర్వహించడం ద్వారా తమ సత్తా చాటాలనే యోచనలో జూపల్లితో పాటు ఇతర నేతలున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌ను ఆహ్వానించి ఆయన సమక్షంలో కండువా కప్పుకుంటామని చెబుతున్నారు.

కర్ణాటక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో..

బీఆర్‌ఎస్‌ను వీడిన తర్వాత ఇతర పార్టీలోకి వెళ్లే అంశంపై మాజీ మంత్రి జూపల్లి మొదటి నుంచి ఆచితూచి అడుగులు వేశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలసి ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాల్లో పాల్గొంటూ పార్టీ మార్పుపై మాత్రం ఎప్పుడూ పెదవి విప్పలేదు. కాంగ్రెస్, బీజేపీల్లో ఏ పార్టీలో చేరుతారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. ఇటీవల కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్‌లో చేరేందుకే వేగంగా పావులు కదిపారు.

కొత్త నేతలతో కలిసివచ్చేనా?

ఉమ్మడి పాలమూరు జిల్లాలో దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరనుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అయితే వీరి రాకతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏ మేరకు ప్రభావం చూపుతుందోనన్న అంశం ఆసక్తికరంగా మారింది. పార్టీలో చేరుతున్న నేతలు తమ సొంత బలంతో పాటు స్థానికంగా ఉన్న కాంగ్రెస్ కేడర్ తమకు ఏ మేరకు కలసి వస్తుందోననే అంచనాలో ఉన్నారు. అయితే రానున్న రోజుల్లో వీరికి పార్టీలోని పాత నేతలు ఎంత మేరకు సహకరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కొడంగల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారు. ఇప్పుడు ఆయన ముఖ్య అనుచరులు కోస్గి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూర అన్న కిష్టప్ప, కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ కూడా కాంగ్రెస్‌లోకి వస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండాలని జూపల్లి భావిస్తుండగా, స్థానిక నేత చింతలపల్లి జగదీశ్వరరావు మాత్రం ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి తానే బరిలో ఉంటానని చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిత్వం తనకే వస్తుందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల తనయుడు రాజేశ్‌రెడ్డి భావిస్తుండగా, రానున్న ఎన్నికల్లో తానే పోటీ చేస్తున్నట్టు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి స్పష్టం చేస్తుండటం గమనార్హం. పార్టీ అధిష్టానం సూచన మేరకు నేతలంతా నడుచుకుంటారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. వనపర్తిలో చేరనున్న మేఘారెడ్డి సైతం తానే పోటీ చేస్తున్నట్టు చెబుతుండటంతో ఈ పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయోనన్న చర్చ జోరుగా సాగుతోంది.

ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి చేరికపై ఇంకా వీడని సస్పెన్స్..

నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ నుంచి తన కుమారుడు రాజేశ్‌రెడ్డికి టికెట్ ఆశిస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తాను సైతం కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా చివరి నిమిషంలో వాయిదా వేసుకుంటున్నట్టు తెలుస్తోంది. ముందుగా తన కుమారుడు రాజేశ్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని నిర్ణయించగా, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాకే ఆ పార్టీలో చేరాలని దామోదర్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు పదవికి రాజీనామా, కాంగ్రెస్‌లో చేరికపై నిర్ణయం తీసుకోనున్నట్టు ప్రచారం సాగుతోంది.

కాంగ్రెస్‌లో చేరనున్న ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలు వీరే..

జూపల్లి కృష్ణారావు, గురునాథ్ రెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, తాడిపర్తి సాయిచరణ్‌రెడ్డి, మేఘారెడ్డి, కూర అన్న కిష్టప్ప, ముద్దప్ప దేశ్‌ముఖ్, జూపల్లి అరుణ్, సూర్యప్రతాప్ గౌడ్, కల్యాణ్‌కుమార్ కొత్త, దండు నర్సింహ, సానె కిచ్చారెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే ప్రకటించారు.



అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ఖర్గేలతో భేటీ అయిన రేవంత్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు

పుస్తక పఠనం.. జ్ఞానాభివృద్ధికి మార్గం



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, పద సంపద పెరుగుతుందని, విద్యార్థుల వ్యక్తిత్వాలు, సమాజం, వివిధ అంశాల పట్ల అవగాహన వస్తుందని డీఈఓ గోవిందరాజులు అన్నారు. సోమవారం ఆయన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 6, 7, 8వ తరగతుల విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు బాగా చదివే విద్యార్థులు అన్ని సబ్జెక్టులను బాగా అర్థం చేసుకోగలరని, అందుకు విద్యార్థులు ప్రతిరోజు పుస్తకాలను చదవడం అలవాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పుస్తక పఠనం కార్యక్రమాలను ప్రతి తరగతి గదిలో అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

కొనసాగుతున్న దోస్త్ సీట్ల కేటాయింపు ప్రక్రియ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీకి సంబంధించి ప్రభుత్వం గత నెల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మొదటి దశ సీట్లను ఈ నెల 16న కేటాయించగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు ఈ నెల 25 వరకు అవకాశం కల్పించారు. కాగా యూనివర్సిటీ పరిధిలో మొత్తం 30,520 సీట్లు ఉండగా.. ఇందులో 4,167 మందికి సీట్లు కేటాయించగా.. 3,187 మంది మాత్రమే రిపోర్ట్ చేశారు. ప్రస్తుతం రెండో దశ సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియ సోమవారంతో ముగియగా.. వెబ్‌ఆప్షన్ పెట్టుకునేందుకు మంగళవారం చివరి అవకాశం ఉంది. ఈ నెల 30న రెండో దశ సీట్ల కేటాయింపు జరగనుండగా.. వచ్చే నెల 7లోగా సెల్ఫ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది.

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

నాగర్‌కర్నూల్: మాదకద్రవ్యాల నిరోధకానికి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ‘మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా’ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్‌లో మాదకద్రవ్యాల నిర్మూలన వ్యతిరేక అవగాహన వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. జీవితం ఆనందమయం కావాలంటే ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. దేశ భవితకు ఆయువు పట్టుగా, బలమైన శక్తిగా నిలవాల్సిన యువత మద్యం, మాదక ద్రవ్యాల మత్తులో తమ శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల చెదిరిన కలలు, విచ్ఛిన్నమైన కుటుంబాలు, ఆనందకరమైన జీవితానికి అవరోధంగా మారతాయి అన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం చేసినట్లు చూస్తే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. మాదకద్రవ్యాల నివారణకు జిల్లాలో ఎప్పటికప్పుడు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. సమాచారం ఉన్నచోట్ల తనిఖీలు చేసి నిందితులను అరెస్టు చేసి కేసులు పెట్టించాలని ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మన్ లక్ష్మణరావు, వార్డ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అతికుర్ రహమాన్, స్వార్డ్ సభ్యులు నీలమ్మ, చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

ఈవీఎంల పనితీరు పరిశీలన

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియను సోమవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఎల్‌ఈ కంపెనీ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 4,325 ఈవీఎంల పనితీరును పది రోజులపాటు పరిశీలిస్తామన్నారు. జిల్లాకు అలాటైనా కంట్రోల్ యూనిట్లు 1,707, బ్యాలెట్ యూనిట్లు 1,330, వీవీప్యాడ్లు 1,298 ఎలక్ట్రానిక్ యంత్రాల మొదటి దశ పరిశీలన అనంతరం 1,500 ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను సిద్ధం చేసి ఈవీఎం గోదాంలో భద్రపరుస్తామన్నారు. తనిఖీల్లో భాగంగా మాక్ పోలింగ్ నిర్వహించిన స్లిప్పులను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఇదిలా ఉండగా కలెక్టర్‌ను సైతం భద్రతా సిబ్బంది తనిఖీ చేసి లోపలికి అనుమతిచ్చారు. వెంట అదనపు కలెక్టర్ మోతీలాల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జాకీర్‌అలీ, ఈడీఎం నరేష్, కలెక్టర్ పీఏస్ ఖాజా, ఎన్నికల సిబ్బంది కరుణాకర్, సీసీ గౌతమ్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కందనూలు: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన తొలిరోజు గ్రామీణ అభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖలపై స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు నిరంతరం వాటిపై దృష్టిసారించి వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి సురక్షితమైన మంచినీటిని సరఫరా చేస్తుందని, జిల్లా పరిధిలోని అన్ని కుటుంబ సముదాయాలతోపాటు రైతువేదికలు, వైకుంఠ ధామాలు, పాఠశాలలు, అంగన్‌వాడీలకు వంద శాతం ఈ నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో మురుగు నిలిచి పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని, వర్షపు నీరు వృథా పోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. హరితహారంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు గౌరమ్మ, రోహిణి, జెడ్పీ సీఈఓ ఉష, డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి

ఔట్ సోర్సింగ్‌తో వసూళ్లు

- మున్సిపాలిటీలోని తాత్కాలిక ఉద్యోగి అక్రమ బాగోతం
- ఉదయమంతా రెక్కీ.. సాయంత్రం ప్రత్యేక భేటీలు
- నూతన మున్సిపల్ చట్టం సాకుతో యథేచ్ఛగా వసూళ్ల పర్వం
- కార్యాలయంలోని అధికారుల పాత్రపై అనుమానాలు

కల్వకుర్తి మున్సిపాలిటీలోని బలరాంనగర్ కాలనీలోని ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం కోసం జీప్లస్ వన్ అనుమతులు తీసుకున్నాడు. అయితే ఆర్థిక స్తోమత సరిపోక గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే నిర్మించి.. దానిపై రేకులతో షెడ్డు వేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన మున్సిపాలిటీలోని ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అక్కడికి వెళ్లి ఇంటి అనుమతులకు అనుగుణంగా నిర్మాణం చేపట్టలేదని చెప్పి ఇంటి నంబర్ విషయంలో కొర్రీలు పెట్టి కొంత సొమ్ము చెల్లించాలని యజమానికి చెప్పాడు. దీంతో సదరు బాధితుడు మున్సిపల్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా ఇప్పటికీ ఇంటి నంబర్ రాలేదు.

పట్టణానికి చెందిన ఓ మహిళ తమ బంధువు ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడగడానికి కార్యాలయానికి వచ్చింది. దీంతో ఓ ఉద్యోగి తాను సూచించిన పత్రాలు తీసుకొని ఓ వ్యక్తి దగ్గరికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దీంతో సదరు మహిళ ఉద్యోగి చెప్పిన వ్యక్తి దగ్గరికి వెళ్లగా.. రూ.వేలు చెల్లించాలని చెప్పారు. నిబంధనల ప్రకారం వెళ్తే ఇంటి అనుమతులు రావని తేల్చిచెప్పడంతో ఖంగుతినడం ఆమె వంతైంది.



కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల సముదాయాలే అతని టార్గెట్. వాటి నిర్మాణంలో చిన్నపాటి తప్పిదాలను గుర్తించి, సదరు యజమానులను కార్యాలయం చుట్టూ తిప్పించుకొని అందిన కాడికి దండుకోవడమే అతని పని. ఇలా మున్సిపాలిటీలో రోజుకో కొత్త నిర్మాణాలపై దృష్టిసారించి పక్కాగా ఎవరికీ అనుమానం రాకుండా యజమానుల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఇదంతా చేస్తున్నది మున్సిపాలిటీలోని ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఓ విభాగంలో పనిచేసే ఉద్యోగి. అతను తనకు కేటాయించిన ఉద్యోగ బాధ్యతల కన్నా అక్రమ వసూళ్ల పైనే దృష్టిసారించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉదయమంతా రెక్కీ..

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మున్సిపాలిటీలోని ప్రతిరోజు ఎంచుకున్న వార్డుల్లో పర్యటించి ఇంటి నిర్మాణాలను గుర్తిస్తాడు. ఆ తర్వాత వాటికి సంబంధించిన అనుమతులు తదితర వాటిని పరిశీలించి.. లోటుపాట్లు కనిపిస్తే సదరు యజమానికి కార్యాలయం ద్వారా నోటీసు అందజేస్తాడు. చివరికి సదరు యజమాని తనను కలిసేలా చేసి.. సాయంత్రం సమయాల్లో బేరసారాలు మొదలుపెడతాడు. ఇలా ఇప్పటి వరకు రూ.లక్షల్లో అక్రమంగా వసూలు చేసినట్లు తెలుస్తుంది. సదరు ఉద్యోగి ఆగడాలను భరించలేని ఓ వ్యక్తి కేసు నమోదు చేయాలని పోలీస్ ఉన్నతాధికారుల వరకు వెళ్తే.. మున్సిపాలిటీలోని కొందరు ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు కొందరు మొదటిసారి తప్పుగా వదిలేయాలని కోరడం కొసమెరుపు.

నూతన మున్సిపల్ చట్టం సాకుతో..

మున్సిపల్ చట్టం- 2019 సాకుగా చూపుతూ వసూళ్లు కొనసాగిస్తున్నాడని సమాచారం. ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా ప్రవేశపెట్టిన టీఎస్-బీపాస్‌లోనూ లొసుగులను అవకాశంగా మలుచుకొని వసూళ్ల పర్వానికి పాల్పడుతున్నాడు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి అనుమతులు తీసుకోవాలనుకున్న వారు ముందుగా సదరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని కలవాలి. ఆ తర్వాత అతను సూచించిన లైసెన్స్‌డ్ ప్లానర్‌కు అతనే ఆ ఇంటి నిర్మాణ ఫైల్ పంపిస్తాడు. అతని ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే ఇంటికి నిర్మాణ అనుమతులు వస్తాయి. అలా కాకుండా వేరే పద్ధతిలో దరఖాస్తు చేస్తే అనుమతులు వచ్చినా.. సదరు ఇంటికి నంబర్ కేటాయించే సమయంలో ఇబ్బందులు పెడతాడని సమాచారం.

నా దృష్టికి రాలేదు



కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే ఉద్యోగి ఇలాంటి పనులు చేస్తున్నాడన్న విషయం నా దృష్టికి రాలేదు. ఇంటి నిర్మాణ అనుమతులలో ఎలాంటి దళారుల జోక్యం లేకుండా ఆన్‌లైన్‌లోనే అనుమతులను ప్రజలు పొందవచ్చు. కార్యాలయం నుంచి ఇలా వసూళ్ల గురించి ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే నన్ను సంప్రదించండి. తక్షణమే అక్రమ వసూళ్లపై దృష్టిసారించి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– అశ్రిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కల్వకుర్తి

ఇబ్బంది లేకుండా..

మున్సిపాలిటీలో పనిచేసే ఉద్యోగుల్లో చాలా వరకు రెగ్యులర్ కన్నా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇలా పనిచేసే ఉద్యోగులను కేవలం పాలకవర్గం అనుమతితో కార్యాలయ అవసరాలకు అనుగుణంగా నియమిస్తారు. వీరంతా కార్యాలయ ప్రధాన అధికారి సూచించిన విధులు చేపట్టాలి. కానీ, ఓ విభాగానికి చెందిన ఓ అధికారి మాత్రం తన రూటే సపరేటు అంటూ.. ఉద్యోగం కన్నా ఎక్కువగా వసూళ్లు చేసే పనిలో నిమగ్నమవుతున్నాడు. ఇలా చేయడంలో అతని వెనక ఎవరు ఉన్నారనే విషయం తెలియక మున్సిపాలిటీలోని సిబ్బందితోపాటు పట్టణ ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. అయితే బయట వ్యక్తి ఇలా వసూళ్లకు పాల్పడితే ఇబ్బందులు రాకుండా ఇలా చేతులు దులుపుకొనేందుకు వీలుగా ఉండటంతో అతనికి ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కార్యాలయంలోనూ అదే తీరు

బయట పనుల్లో ఇలాంటి వ్యవహారాన్ని కొనసాగిస్తున్న సదరు ఉద్యోగికి ఏ మాత్రం తీసిపోకుండా కార్యాలయంలోనూ కొందరు ఉద్యోగులు ఇదే పంథాను అనుసరిస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక అందుకు సంబంధించి అసెస్‌మెంట్‌ను పూర్తి చేయాల్సిన విభాగంలోనూ చేతివాటం లేనిదే పనులు జరగడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. నిర్మాణం పూర్తయ్యాక ఇంటి నంబర్ కేటాయించే విభాగంలో దరఖాస్తు పత్రాలు ఇస్తే, అవి అసలు సంబంధం లేని విభాగంలో ప్రత్యక్షమవుతాయి. అసెస్‌మెంట్‌లో ఆలస్యంపై ఎవరైన ప్రజలు కార్యాలయానికి వెళ్తే సదరు ఉద్యోగి దగ్గర ఫైలు ఉంది.. అతన్ని కలవండి అని సంబంధిత విభాగంలోని అధికారులే చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ తతంగమంతా పాలకవర్గానికి, కార్యాలయ ప్రధాన అధికారికి తెలియకుండానే జరుగుతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


భాస్కర్ నాయక్ (ఫైల్)

మదనాపురం: ప్రమాద వశాత్తు విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కరివేనతండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన కెతావత్ భాస్కర్‌నాయక్ (40) సోమవారం ఉదయం 7గంటలకు బహిర్భూమికి తమ్ముడి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి ఈదురుగాలులకు కరెంట్ మోటార్ వైరు తెగి పొలంలో పడింది. కరెంట్ లేదని వైరును తీసి చేతులతో చుడుతుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య చిన్న లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నం

వెల్దండ: మండల కేంద్రంలోని బుదార్‌పేట హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. ఆయంలోని హుండీని ఎత్తుకెళ్లి ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా తెరుచుకోకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే దుండగులు ఆలయంలోని సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసినట్లు పోలీసులు చెప్పారు.

మక్కాలో హజ్ యాత్రికుడి మృతి


షంసీర్‌పాష(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: హజ్‌యాత్రకు వెళ్లిన జిల్లాకేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మక్కాలో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే జిల్లాకేంద్రంలోని మర్లుకు చెందిన షంసీర్‌పాష (56) చిన్నచింతకుంట జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన భార్య షాహినాబేగంతో కలిసి హజ్ యాత్రకు బయలుదేరారు. ఆదివారం అనారోగ్యానికి గురై షంసీర్‌పాష మక్కాలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలు హరంషరీఫ్‌లో జరిగాయి. షంసీర్‌పాష మృతిపై తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

కల్వకుర్తి రూరల్: కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. మండలంలోని ముకురాలకు చెందిన శివాని(20)ని నల్లగొండ జిల్లా డిండి మండలం రామాంతపూర్‌కు చెందిన రాజుకు ఇచ్చి గతేడాది వివాహం జరిపించారు. అయితే రాజుకు ఆరు నెలలుగా అనారోగ్య సమస్యలు తలెత్తడంతో శివానిని తల్లిదండ్రుల వద్దే ఉంచాడు. దీంతో తన పరిస్థితి బాగోలేదని మనస్తాపానికి గురైన శివాని సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతిచెందింది. ఈ ఘటనపై శివాని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీపనగండ్లలో యువకుడు..

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన దయ్యపు రాజు(32) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాజు హైదరాబాద్‌లో టిప్పర్ డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. అయితే ఆదివారం రాత్రి భార్య, పిల్లలు ఇంట్లో లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజుకు భార్య సువర్ణ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు. రాజు మృతికి గల కారణాలు తెలియదని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఇంటికప్పు కూలి వృద్ధుడి మృతి

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన వృద్ధుడు చంద్రయ్యగౌడ్(80) సోమవారం ఇంటి మట్టి కప్పుపై గడ్డిని తొలగిస్తుండగా ప్రమాదశావత్తు కప్పు కూలి మృతి చెందాడు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి పైకప్పుపై గడ్డి మొలకెత్తింది. స్థానికులు శిథిలాల కింద పడిపోయిన చంద్రయ్యను ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడని వైద్యులు తెలిపారు.

బకెట్‌లో పడి బాలుడు మృతి

బిజినేపల్లి: ఇంటి ముందు ఉన్న బకెట్‌లో పడి ఏడాది వయస్సు బాలుడు మృతి చెందాడు. సోమవారం సాయంత్రం బిజినేపల్లిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కృష్ణయ్య, రేణుకకు సంవత్సరం వయస్సు ఉన్న బాలుడు ఉన్నాడు. ఇంటి ముందర ఆడుకుంటూ వెళ్లి బకెట్‌లో పడిపోయాడు. కాసేపటి తర్వాత తల్లి బయటికి వచ్చి పసికందును వెతకగా బాలుడు బకెట్‌లో పడి మృతి చెందడం గమనించారు.

ధర దడ



- కిలో రూ.150కి చేరిన పచ్చిమిర్చి
- పెరుగుతున్న టమాట ధర
- కర్ణాటకలోని బెల్గాం నుంచి పచ్చిమిర్చి దిగుమతి

జడ్చర్ల టౌన్:

ఆషాఢమాసం ఆరంభం కాగానే కూరగాయల ధరలు పెరుగుతుండటంతో మధ్య తరగతి నుంచి సామాన్యుల వరకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా ఆషాఢం, శ్రావణమాసాల్లో ఇదే పరిస్థితి నెలకొంటుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుత సీజన్‌లో స్థానికంగా దిగుబడి రాకపోవటంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావటం వల్ల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. పచ్చిమిర్చి కిలో రూ.150కి చేరింది. టమాట రూ.60కి పెరిగింది. ఇతర కూరగాయలు సైతం రోజురోజుకూ పెరుగుతూ వస్తున్నాయి.

స్థానికంగా పండని పంటలు..

వేసవి కాలంలో మిర్చిపంట సాగు పూర్తిగా తగ్గిపోతుంది. దానికితోడు వర్షాలు సకాలంలో కురవకపోవటంతో పచ్చిమిర్చి దిగుబడి మరింత ఆలస్యం కానుంది. వేసవిలో సాగు చేసిన టమాట ఇతర కూరగాయల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. ఈకారణంగా ఆషాఢం, శ్రావణ మాసాల్లో ఈ ప్రాంతంలో కూరగాయల కొరత ఏర్పడుతుంది. సమీపంలోని షాద్‌నగర్, శంషాబాద్ మార్కెట్లలోనూ కూరగాయల కొరత ఏర్పడటంతో పక్క రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తుండటంతో ధరలు పెరుగుతున్నాయి.

టమాటది అదే దారి..



టమాట ధరలు సైతం పెరుగుతున్నాయి. పదిరోజుల క్రితం కిలో టమాట రూ.30గా ఉండగా సోమవారం రూ.60కి పెరిగింది. పది రోజుల్లోనే రెట్టింపు కావటంతో సామాన్యులు ఇబ్బందిపడుతున్నారు. వేసవిలో అకాల వర్షాలకు టమాట పంట దెబ్బతినటంతో దిగుబడి తగ్గింది. ధర పెరుగుతూ వస్తోంది. ప్రతి ఇంట్లో ఏ కూరగాయ వండినా అందులో టమాట, పచ్చిమిర్చి వాడటం పరిపాటిగా మారింది. అందువల్లే వీటి ధర పెరిగితే అన్నివర్గాల వారు ఆందోళన వ్యక్తం చేస్తారు.

బెల్గాం నుంచి పచ్చిమిర్చి దిగుమతి..

ప్రస్తుతం జిల్లాకు కర్నాటక జిల్లా బెలగం నుంచి పచ్చిమిర్చి దిగుమతి చేసుకుంటున్నారు. దళారీలు జిల్లా కేంద్రానికి లారీలో పచ్చిమిర్చి తీసుకువచ్చి అక్కడి నుంచి జిల్లా నలుమూలలకు సరఫరా చేస్తున్నారు. ఈ కారణంగా ధరలు పెరుగుతున్నాయి. సోమవారం కిలో పచ్చిమిర్చి రిటైల్ దుకాణంలో రూ.150గా నమోదైంది. నాలుగైదు రోజులుగా రూ.120గా ఉండగా సోమవారం కిలోకు రూ.20 పెరిగింది.

ధర వింటేనే ఘాటు..



పచ్చిమిర్చి ధర వింటేనే కూరగాయల్లో వేయకుండానే ఘాటు కలుగుతుంది. నిత్యం ఇంట్లో ఏ కూరగాయ వండినా టమాట, పచ్చిమిర్చి ఉండాల్సిందే. మార్కెట్‌లో పది రోజులుగా టమాట, మిర్చి ధరలు పెరగటం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వాలు ధరలు పెరగకుండా చూడాలి.

– కె.శ్రీలత, గృహిణి, జడ్చర్ల

కష్టంగా మారుతుంది..



పచ్చిమిర్చి కిలో రూ.150కి చేరటం, టమాట రూ.60కి పెరగటం కష్టం అవుతుంది. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. మాలాంటి చిరుద్యోగులకు పెరిగిన ధరలు అదనపు భారమే. ఏడాది పొడుగునా ధరలు నియంత్రణలో ఉండేలా చూడాలి.

– కె. వనిత, ప్రైవేట్ ఉద్యోగి, జడ్చర్ల

ధర స్థిరంగా ఉండేలా చూడాలి..



ప్రతినెలా బడ్జెట్ ప్రణాళిక వేసుకుని ముందుకు సాగుతుంటాము. అకస్మాత్తుగా ధరలు పెరగటం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. పది రోజుల్లోనే కూరగాయల ధరలు రెట్టింపు కావటం ఆందోళనగా ఉంది. ఏడాది పొడవునా ధరలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– జి.శారద, ప్రభుత్వ ఉద్యోగి, జడ్చర్ల

ప్రస్తుతం కూరగాయల ధరలు.. (రూ.కిలోకు)

పచ్చిమిర్చి	150
టమాట	50-60
బీరకాయ	80
చిక్కుడుకాయ	80
క్యారెట్	80
బీన్సీస్	80
కాకరకాయ	80
క్యాప్సికం	60-80
క్యాబేజి	40
వంకాయ	30-40
ఆలుగడ్డ	25-40
గోబీపువ్వు	40-60

దిగుమతి వల్లే ధరల పెంపు..



ఏటా వేసవి ముగిసి, వర్షాకాలం వచ్చే సమయంలో స్థానికంగా కూరగాయల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. దీని వల్ల ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ధరలు పెరుగుతున్నాయి. పచ్చిమిర్చి కర్నాటక బెలగం నుంచి మహబూబ్‌నగర్ తీసుకువస్తారు. అక్కడి నుంచి జడ్చర్లకు సరఫరా చేస్తున్నారు. స్థానికంగా మిర్చి రావటానికి మరో నెల పడుతుంది. అప్పటి వరకు ధరలు ఇలాగే ఉంటాయి.

– శివకుమార్, కూరగాయల వ్యాపారి, కావేరమ్మపేట


వెలవెలబోతున్న కూరగాయల మార్కెట్

హాస్టల్ విద్యార్థుల మధ్య గొడవ

- ఒకరికి కత్తి పోట్లు.. కేసు నమోదు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన

ఉప్పునుంతల: హాస్టల్ విద్యార్థుల మధ్య గొడవ చిలికిచిలికి సోమవారం రాత్రి కత్తి పోట్లకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గురుస్వామి కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలోని బీసీ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న ఉప్పునుంతలకు చెందిన సాల్వాడి నరేష్‌తోపాటు రవితేజ, కార్తీక్ రాత్రి 8 గంటల సమయంలో హాస్టల్‌లో భోజనం చేసి పడుకోవడానికి గ్రామంలోని ఇంటికి బైక్‌పై బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత బీసీకాలనీలోని వాటర్‌ట్యాంక్ సమీపంలో హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్న అదే కాలనీకి చెందిన విద్యార్థులు మందుల రాము, మేడమోని చరణ్‌లు ఇద్దరు కలిసి బైక్‌పై వెళ్తున్న వారిని అడ్డగించి గొడవకు దిగారు. ఈ క్రమంలోనే రాము తన వెంట తెచ్చుకున్న కత్తితో నరేష్‌ను పలుపోట్లు పొడిచాడు. నరేష్ గట్టిగా కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న నరేష్ తల్లి లక్ష్మమ్మ అక్కడి వచ్చి కొడుకును వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అనంతరం నరేష్ తల్లి ఫిర్యాదు మేరకు ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. నరేష్‌కు ఆరేడుచోట్ల కత్తిపోటు గాయాలయ్యాయని, విద్యార్థుల మధ్య గొడవకు ప్రేమ వ్యవహారమే కారణమని ప్రాథమికంగా తెలిసిందని చెప్పారు.

ఆస్పత్రి వేళలో వస్తేనే వైద్యం చేస్తాం

- నడవలేని స్థితిలో ఉన్న రోగికి వైద్యంచేయని సిబ్బంది
- రెండు గంటలపాటు ఎదురుచూసి వెళ్లిపోయిన బాధితుడు


తాళం వేసిన ఆస్పత్రి ముందు ఆటోలో బాధితుడు ఎల్లప్ప

కోస్గి: మున్సిపల్ పరిధిలోని తిమ్మాయపల్లికి చెందిన ఓ వ్యక్తి వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి రావడంతో ఆస్పత్రి సమయం అయిపోయిందని, సాయంకాలం వస్తేనే వైద్యం చేస్తామని చెప్పి వైద్యానికి నిరాకరించిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. తిమ్మాయపల్లికి చెందిన ఎల్లప్ప రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలికి గాయాలయ్యాయి. కొంతకాలు భాగం తీసివేశారు. ఒకరోజు విడిచి ఒకరోజు గాయాన్ని శుభ్రం చేసి కట్టు కట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఓ ఆటోలో కట్టు కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చాడు. మధ్యాహ్నం 2గంటలకు ఆస్పత్రికి వచ్చాడు. దీంతో ఆస్పత్రి సమయం అయిపోయిందని, సాయంత్రం 4 గంటలకు రావాలని సిబ్బంది చెప్పారు. వైద్యం చేయడానికి నిరాకరించారు. నడవలేని స్థితిలో ఉన్నాడని, కట్టుకడితే వెళ్తామని బాధితులు ప్రాధేయపడినా వినిపించుకోలేదు. ఆస్పత్రి వేళల్లో వస్తేనే వైద్యం చేస్తాం.. మీ ఇష్టం వచ్చినట్లు వస్తే చేయం. ఎవరికైనా చెప్పుకోండి అంటూ రోగిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక బాధితుడు ఎల్లప్ప ఇంటికి వెళ్లిపోయాడు. ఈవిషయమై ఆస్పత్రి వైద్యుడు అనుదీప్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేడు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్


చోరీ చేసిన బైక్‌లు, నిందితుడిని చూపుతున్న ఎస్పీ కె.నరసింహ

- 11 బైక్‌లు, ఒక ఆటో సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: ఆటో నడుపుతూ జల్సాలకు అలవాటుపడిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేయడం ప్రారంభించి.. పోలీసులకు దొరికిపోయాడు. జిల్లాలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని రాజాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సోమవారం మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కె.నరసింహ వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా విద్యానగర్‌కాలనీకి చెందిన తాయి ప్రశాంత్‌కుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో అతను సుభద్ర అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఆ విషయం భార్యకు తెలిసి ఇద్దరు పిల్లలను చెరువులో తోసి ఆమె చెరువులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇద్దరు పిల్లలు మృతి చెందగా ఆమె బతకగా.. పోలీసులు జైలుకు పంపారు. దీంతో తాయి ప్రశాంత్‌కుమార్, సుభద్రను తీసుకుని మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని లక్ష్మీనగర్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవనం కోసం చిన్న చిన్న పనులు చేస్తే వచ్చిన డబ్బులు సరిపోవడం లేదని బైక్ దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. మొదట రాజాపూర్‌లో మూడు, రంగారెడ్డిగూడలో రెండు, జడ్చర్లలో ఒకటి, షాద్‌నగర్‌లో రెండు, హయత్‌నగర్‌లో ఒకటి, కొత్తూర్‌లో ఒకటి, మైలార్‌దేవ్‌పల్లిలో ఒక బైక్‌తోపాటు సూర్యాపేటలో ఒక ఆటోను చోరీ చేశాడు. దొంగతనం చేసిన వాహనాలు అన్నింటిని తీసుకువచ్చి లక్ష్మీనగర్‌కాలనీలో అద్దెకు ఉంటున్న ఇంట్లో పెట్టుకున్నాడు. సోమవారం ఉదయం స్కూటీపై హైదరాబాద్ వెళ్తుండగా రాజాపూర్ పోలీసులు చేసిన వాహన తనిఖీల్లో పట్టుబడగా విచారిస్తే దొంగతనాలు బయటపడినట్లు ఎస్పీ తెలిపారు. అతని నుంచి మొత్తం 11 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఇతను 2019లో సూర్యాపేటలో ఆటో దొంగతనం కేసులో జైలుశిక్ష అనుభవించినట్లు వెల్లడించారు. ప్రతి వాహనదారుడు వారికి సంబంధించిన వాహనాలకు జీపీఎ సిస్టంతోపాటు ఇంటి ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో 40 దొంగతనం కేసులు ఛేదించినట్లు వివరించారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ లక్ష్మణ్, సీఐలు జమ్ములప్ప, ఇఫ్తేకార్, ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో ప్రపంచ రికార్డు


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: పెన్ను, పేపర్ లేకుండా మెదడులో కసరత్తు చేసి గణితంలో సమాధానాలు చెప్పే విధానం అబాకస్. దీంట్లో అతి వేగంగా అత్యధిక ప్రశ్నలను సాధించి పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రపంచ రికార్డు పొందారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక సింగార్‌బేస్ వీధిలో రీతూ అనే శిక్షకురాలు ప్రైవేట్‌గా కొద్దికాలంగా అబాకస్‌లో పిల్లలకు శిక్షణ ఇస్తుంది. ఈ క్రమంలో గతేడాది పట్టణానికి చెందిన చరణ్, వైభవ్, ప్రణవి ఐరేంజ్ సంస్థకు దరఖాస్తు చేసుకోగా వారి నుంచి పరీక్షలో పాల్గొనేందుకు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ఆయా విద్యార్థులకు సంబంధించిన వీడియోలను అప్‌లోడ్ చేయగా వారు చూసి ఆన్‌లైన్‌లో లైవ్‌లో పరిశీలించారు. అవాక్కైన వారు హైదరాబాద్ కార్యాలయానికి పిలిపించి పది డిజిట్ లకు సంబంధించిన వంద ప్రశ్నలను వేయగా పెన్ను, పేపర్ లేకుండా ఒక్క నిమిషంలోనే సమాధానాలు చెప్పారు. దీంతో వారిని అబాకస్‌లో అర్థమెటిక్ క్యాలిక్యులేషన్ ప్రక్రియలో ప్రపంచ రికార్డు సాధించినట్లు ప్రకటించి ప్రశంసాపత్రాలను అందించారు. దీంతో సోమవారం కలెక్టర్ శ్రీహర్ష ముగ్గురు విద్యార్థులు, టీచర్‌ను అభినందించారు.

జింక పిల్ల అప్పగింత



అడ్డాకుల: గొర్రెల కాపరులకు చిక్కిన జింక పిల్లను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మూసాపేట మండలం జానంపేట శివారులో చక్రాపూర్ రోడ్డు సమీపంలో సోమవారం గ్రామానికి చెందిన నక్క మల్లేష్, బాలకృష్ణలు గొర్రెలను మేపుతున్నారు. అదే సమయంలో ఓ జింక పిల్ల గొర్రెల మంద వద్దకు రాగా అక్కడే ఉన్న కుక్కలు దాన్ని వెంబడించాయి. దీంతో ఇద్దరూ కలిసి కుక్కల నుంచి జింక పిల్లను రక్షించారు. విషయాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులుకు తెలుపగా ఆయన జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ సిబ్బంది జానంపేటకు వచ్చి జింక పిల్లను జిల్లా కేంద్రానికి తరలించారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు 1,017 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు నీటిని విడుదల చేయడం లేదు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ధాన్యం కోతలతో బెంబేలు

- న్యాయం చేయాలని రైతుల వేడుకోలు
- పోమాల్‌లో రూ.4లక్షల వరకు మిల్లర్ల దోపిడీ

నవాబుపేట: కష్టపడి పండించిన ధాన్యం ఇబ్బందులు మధ్య కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే, తీరా కొన్నాకా ఇష్టానుసారంగా కోతలు విధించి రైతులను నష్టపరిచారని రైతులు వాపోతున్నారు. మండలంలోని పోమాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏకంగా లారీ లోడ్‌లో 40 బస్తాల చొప్పున కోతలు విధించారు. లారీ ధాన్యంలో మిల్లర్ల కోతల మూలంగా రైతులు రూ.40 వేల వరకు నష్టపోతున్నారు. ఇకే గ్రామంలోనే దాదాపుగా 12 లారీల ధాన్యంలో కోతలు విధించినట్లు రైతులు తెలిపారు. ధాన్యం కొనే ముందు వివిధ రకాలు తేమ, దుమ్మును పరిశీలించి కొన్నారని, తీరా మిల్లర్లకు చేరిన చాలా రోజులకు తమ ధాన్యం కోత విధించి ఫోన్‌లో మెసేజ్‌లు పంపుతున్నారని రైతులు చెప్పారు. తమను నట్టేట ముంచుతున్న మిల్లర్ల అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అయినా కూడ రూ.20 వరకు తూకాలు, లోడింగ్‌కు ఖర్చు చేసుకున్నారు. కేవలం పోమాల్ గ్రామంలోనే రైతులు దాదాపుగా రూ.4 లక్షల వరకు మిల్లర్ల కోతలతో నష్టపోయారు.


నష్టపోయామని వాపోతున్న రైతులు

పదిరోజుల తర్వాత..



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూర్పార పట్టి, తేమ కోసం ఎండలో పెట్టిన అనంతరం ధాన్యం విక్రయించాం. తీరా కొనుగోలు చేసి లారీల్లో ధాన్యం మిల్లర్లకు చేర్చిన పది రోజుల అనంతరం ధాన్యం లారీకి 40 బస్తాలకు పైగా కోతలు విధిస్తున్నామని ఫోన్లకు వాట్సప్‌లో మెసేజ్‌లు పంపించారు. మాకు వెంటనే న్యాయం చేయాలి, లేకుంటే ఆందోళన చేస్తాం.

– నర్సింహులు, రైతు, పోమాల్

రూ.40 వేల వరకు నష్టం



ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మితే ఒక్కో రైతు మిల్లర్ల కోతల మూలంగా రూ.10వేల నుంచి రూ.40 వేల వరకు నష్టపోతున్నాడు. ఈ విషయంలో ఎవరు ఆదుకుంటారో చెప్పాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రమైనా కూడా తూకం చేయాలంటే డబ్బులు, లారీలో నింపాలంటే సైతం డబ్బులు ఇచ్చాం. చివరకు లారీలు తొందరగా రావాలని ఒక్కో బస్తాకు అదనంగా రూ.4 ఇచ్చాం. తీరా ధాన్యం తీసుకున్న మిల్లర్ రూ.వేలు కోతలు విధిస్తే ఊరకునేది లేదు. అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలి.

–యాదగిరి, పోమాల్

క్లుప్తంగా...

పవన్ కులాలు, మతాలను రెచ్చగొడుతున్నారు

ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుపతి అర్బన్: గూండాలు, వెన్నుపోటుదారులు టీడీపీ గట్టు వైపే ఉన్నారని.. తమ పార్టీలో అలాంటి నేతలు ఎవరూ లేరని ఏపీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి స్పష్టంచేశారు. అవినీతి రాజ్యం చంద్రబాబు పాలనలోనే సాగిందని.. వంగవీటి రంగాను హత్య చేయించింది ఆయనేనని ఆరోపించారు. మరోవైపు.. పవన్ పదే పదే మతాలు, కులాలను రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని నారాయణ స్వామి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ముద్రగడ పద్మనాభం కాపుల సంక్షేమం కోసం పోరాడుతుంటే.. ఆ పోరాటాన్ని అణగదొక్కిన ఘనత చంద్రబాబుదే. ఆ సమయంలో పవన్‌కల్యాణ్ చంద్రబాబును ఒక్కసారి కూడా ప్రశ్నించలేదు. చిరంజీవి విలువలతో కూడిన రాజకీయం చేశారు. అయితే, ఆయన తమ్ముడు పవన్‌కల్యాణ్ మాత్రం చెప్పులతో దాడిచేస్తాం.. రాళ్లతో దాడి చేస్తామంటూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. అసలు కాపులకు ఆయన చేసింది ఏమిటి? వారాహి యాత్ర ద్వారా చంద్రబాబుకు లబ్ధిచేకూర్చడానికి ప్రయత్నిస్తున్నారు' అని పేర్కొన్నారు.

ప్రపంచానికి 'యోగి'లను అందిస్తాం: రాందేవ్



హరిద్వార్: యోగాతో ప్రపంచానికి మరింత ఆరోగ్యాన్ని అందించేందుకు పతంజలి యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్‌లో ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి యూనివర్సిటీలకు వెళ్తారని స్వామి రాందేవ్‌బాబా అన్నారు. అన్ని హద్దులను చెరిపేసి ఇప్పుడు హిందూ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్, జైన్, బుద్ధిస్టులందరూ దేశమంతటా యోగా చేస్తున్నారని తెలిపారు. యోగావల్ల దేశప్రతిష్ట ఇప్పుడు విశ్వవ్యాప్తిమయ్యిందన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి వెల్‌నెస్ సెంటర్‌లోని పతంజలి యోగాపీఠ్ మైదానంలో యోగా సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాందేవ్.. పలువురు యోగా సాధకులను ఉద్దేశించి ప్రసంగించారు.

గూడు చెదిరి.. గుండెలవిసి!

అంతర్గాంలోని బర్మా, శ్రీలంక కాందిశీకుల దీనావస్థ

1971 నాటికి 1,000 కుటుంబాలకు ఇక్కడ పునరావాసం

1989లో దేశవ్యాప్తంగా నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాల పంపిణీ

అంతర్గాంలో 502 ఎకరాలు కేటాయించినా సొంతింటికి నోచుకోని వైనం

వెయ్యికిగాను ఇప్పుడు మిగిలింది 374 కుటుంబాలే..

తమకైనా కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని వినతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

ప్రాణభయంతో ఓ దేశం నుంచి మరో దేశానికి వలస వెళ్లే వారిని కాందిశీకులు అంటారు. ఇలాంటి వారికి పరాయిగడ్డపై ఆశ్రయం దొరకడమే గగనం. దొరికినా వారికి పెద్దగా హక్కులు ఉండవు. కానీ బ్రిటిష్ పాలనలో పని కోసం మన దేశం నుంచి పొరుగున ఉన్న బర్మా (మయన్మార్), శ్రీలంకలకు వలసవెళ్లి అక్కడ సైనిక నియంతల హెచ్చరికలు, అంతర్యుద్ధాల కారణంగా తిరిగి భారతదేశానికి వచ్చిన కాందిశీకులది మరో కథ. వెళ్లిన కొన్నేళ్ల తర్వాత మాతృ దేశంలో బిక్కుబిక్కుమంటూ అడుగుపెట్టిన వారిని భారత్ తల్లిలా అక్కున చేర్చుకుంది. వారికి పునరావాసం కల్పించింది. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం అంతర్గాంలో వెలసిన శరణార్థుల కాలనీలో తెలుగు వారికి కేంద్రం పునరావాసం కల్పించింది. ఇలాంటి వారందరికీ దేశవ్యాప్తంగా..ఇళ్లు, వ్యవసాయ స్థలాలు పంపిణీ చేసినా అంతర్గాంలో మాత్రం ఇంకా ప్రభుత్వ హామీలు నెరవేరలేదు. తమకు కనీసం ఇళ్లైనా మంజూరు చేయాలని వారు దీనంగా వేడుకుంటున్నారు.

అసలు ఏం జరిగింది?



లాల్ బహదూర్ శాస్త్రి-సిరిమావో బండారు నాయకేల ఇండో, శ్రీలంక ఒప్పందం 1964 (ఫైల్)

19వ శతాబ్దంలో దేశంలో విపరీతమైన కరువు వచ్చింది. ఈ కరువును ఎదుర్కొనే ప్రయత్నాలు చేయకుండా మన దేశంలోని పేదలను బర్మా, శ్రీలంక, మలేసియా తదితర దేశాల్లో తోటల్లో పనిచేసేందుకు కూలీలుగా పంపారు. అలా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర నుంచి వేలాదిమంది బర్మాకు వలస వెళ్లారు. అక్కడ వ్యాపారాలు, పనులు చేసి రూ.కోట్లు గడించారు. అయితే 1962లో బర్మాలో సైనిక నియంత నె విన్ తిరుగుబాటుతో ప్రభుత్వం కుప్పకూలింది. పగ్గాలు చేపట్టిన నె విన్ విదేశీయులు కట్టుబట్టలతో దేశం విడిచి వెళ్లాలంటూ హుకూం జారీ చేశాడు. సైనికులు భారతీయుల ఇళ్లను దోచుకున్నారు. కనీసం మెడలో తాళిబొట్టును కూడా అనుమతించలేదు. అయితే అప్పటి భారత ప్రధాని నెహ్రూ ఆధ్వర్యంలో ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు భారత సంతతి ప్రజలను దేశానికి తీసుకొచ్చి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పించారు. ఈ తరలింపు లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ హయాం వరకు పలు దఫాలుగా సాగింది. వీరితో పాటే శ్రీలంకలో జాతుల మధ్య పోరు వల్ల ఇండియాకు వచ్చిన తమిళులకూ చోటు ఇచ్చారు. ఇలా 1971 నాటికి అంతర్గాంలో దాదాపు 1,000 బర్మా, శ్రీలంక కుటుంబాలు ఆశ్రయం పొందాయి. 1989లో దేశవ్యాప్తంగా ఇలాంటి వారికి నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇదే క్రమంలో అంతర్గాం కాందిశీకులకు కేంద్రం 502 ఎకరాల భూమి కేటాయించింది. ప్రత్యేకంగా వీవింగ్ సొసైటీని ఏర్పాటు చేసి జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు తెరిచి ఉపాధి కల్పించింది. అప్పట్లో తెరిచిన మిల్లులు అధికారుల అవినీతి కారణంగా 1990వ దశకంలో మూతబడ్డాయి. కార్మికులకు కనీసం వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ కూడా రాలేదు. ఉపాధి కోల్పోవడంతో ఆకలి మరణాలు సైతం సంభవించాయి. కొన్ని కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా.. ప్రస్తుతం ఇక్కడ 374 కుటుంబాలు మాత్రమే మిగిలాయి. కానీ ఇప్పటికీ భూమి, ఇళ్ల స్థలాలకు సంబంధించిన హామీ మాత్రం నెరవేరలేదు.

ఇండస్ట్రియల్ పార్కులో కొలువులివ్వండి..



తమ సంక్షేమానికి కేంద్రం ఏర్పాటు చేసిన మిల్లులు మూతబడ్డాయని, కేటాయించిన 502 ఎకరాల్లో 250 ఎకరాలైనా తమ కుటుంబాలకు కేటాయించాలని అంతర్గాంలో ఉన్న కాందిశీకులు కోరుతున్నారు. వాస్తవానికి 2009 సెప్టెంబర్ 1న ఇళ్ల స్థలాల విషయమై అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని వీరు కలిశారు. దీంతో వెంటనే అందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆ మరునాడే వైఎస్ హెలీకాప్టర్ ప్రమాదంలో మరణించడంతో, ఇప్పటివరకు వీరి గోడు పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దాదాపు 100 ఎకరాలు ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు కేటాయించిన భూములు కబ్జాలకు గురవుతున్నాయని, తొలుత తమకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి పదిగుంటల నివాస స్థలం ఇచ్చాకే, పరిశ్రమలు స్థాపించాలని శరణార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ స్థాపించబోయే పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పనలో బర్మా, శ్రీలంక శరణార్థుల కుటుంబాలకే తొలి ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు అప్పట్లో పునరావాసం కోసం ఏర్పాటు చేసిన క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి మరమ్మతు చేసుకుందామంటే స్థానిక అధికారులు అంగీకరించడం లేదు. కనీసం ఉన్న గూడుకు మరమ్మతులు చేసుకునే అవకాశం కల్పిస్తే..శరణార్థుల కుటుంబాలు తలదాచుకునేందుకు అవకాశం ఉంటుందని శ్రీలంక, బర్మా శరణార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జమ్ముల రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'మార్గదర్శి'లాంటి స్కాం ఇప్పటివరకు జరగలేదు

- మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదే
- విచారణ వివరాలు తెలుసుకునే హక్కు వారికి ఉంది
- తెలంగాణ హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లాంటి కుంభకోణం ఇప్పటివరకు జరగలేదు, ఇకపై జరగబోదని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. 'మార్గదర్శి'కి సంబంధించిన కేసులపై సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని వెల్లడించింది. మార్గదర్శి కేసు దర్యాప్తు వివరాలను సీఐడీ అధికారులు మీడియాకు వెల్లడిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరుతూ చెరుకూరి రామోజీరావు, శైలజ, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రై. లిమిటెడ్ తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదేనని చెప్పారు. ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం విచారణ వివరాలు తెలుసుకునే ప్రాథమిక హక్కు వారికి ఉందన్నారు. ఈ రకమైన ఓ కుంభకోణం జరగడం ఇదే తొలిసారిని చెప్పారు. ఇదే విజ్ఞప్తిపై గతంలోనూ ఇదే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అప్పుడు పిటిషనర్‌కు అనుకూలంగా ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌ను కూడా కొట్టివేయాలని కోరారు. అసలు మార్గదర్శి వేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపే అర్హత ఈ కోర్టుకు ఉందా అన్న అంశంపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ పిటిషన్ జూలై 18న విచారణకు రానుందని, అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను జూలై 20కి వాయిదా వేసింది.

ఐటీ ఎగుమతుల్లో బూమ్

ఏపీలో నాలుగేళ్లలో 34 శాతం పెరిగిన ఎగుమతులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు గత నాలుగేళ్లుగా వేగంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో పలు ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభిస్తుండటంతో ఐటీ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదవుతోంది. స్టాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), వీసెజ్‌ల్లో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా 2022–23లో రాష్ట్రంలో రూ.1,649.25 కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరిగినట్లు ఐటీ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో ఎస్‌టీపీఐలో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా రూ.972.43 కోట్ల ఎగుమతులు జరగగా వీసెజ్ కంపెనీల ద్వారా రూ.676.82 కోట్ల ఎగుమతులు జరిగాయి.

రూ.5,000 కోట్లపైనే!

2019–20లో ఏపీ నుంచి రూ.1,087.4 కోట్ల ఐటీ ఎగుమతులు నమోదు కాగా నాలుగేళ్లలో 34% పెరిగాయి. నాలుగేళ్లలో ఎస్‌టీపీఐ కంపెనీల ద్వారా ఎగుమతులు రూ.846.77 కోట్ల నుంచి రూ.972.43 కోట్లకు పెరిగితే వీసెజ్ ద్వారా ఎగుమతులు రూ.240.63 కోట్ల నుంచి 676.82 కోట్లకు చేరుకున్నాయి. ఇంకా పలు ఐటీ కంపెనీల ఆడిటింగ్ పూర్తికాలేదని, ప్రాథమిక సమాచారం మేరకు 2022–23 ఐటీ ఎగుమతుల అంచనాలను రూపొందించినట్లు ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రం నుంచి భారీగా ఎగుమతులు జరుగుతున్నా వాటి ప్రధాన కార్యాలయాలు ఇక్కడ లేకపోవడంతో రాష్ట్ర పరిధిలోకి రావడం లేదని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) ప్రెసిడెంట్ శ్రీధర్ కోసరాజు పేర్కొన్నారు.

ఆర్నెల్లలో వరుసగా..

ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు ఐటీ కంపెనీలు విశాఖతోపాటు పలు ద్వితీయ శ్రేణి పట్టణాల్లో తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. 2019కి ముందు రాష్ట్రంలో ఐటీ కంపెనీల సంఖ్య 178 కాగా ఇప్పుడు 372కి చేరుకోవడం గమనార్హం. కొత్తగా ఏర్పాటైన కంపెనీల ద్వారా అదనంగా 20,000కి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు 'అపిటా' గ్రూపు సీఈవో ఎస్.కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పారు.

టీడీపీతో పొత్తు పెట్టుకోం: సోము వీర్రాజు

చిల్లకూరు(తిరుపతి జిల్లా)/చిత్తూరు కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో అందరూ అనుకున్నట్లు టీడీపీతో పొత్తు పెట్టుకునేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెంలో సోమవారం కేంద్ర ఐటీ సహాయ మంత్రి దేవూసిన్హ్ చౌహాన్‌తో కలసి ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పొత్తులతో అధికారంలోకి రాదని, అందుకే రాష్ట్రంలో టీడీపీతో ఎలాంటి పరిస్థితుల్లో పొత్తు పెట్టుకోకూడదని అనుకుంటున్నట్లు తెలిపారు. అయి తే జనసేనతో మాత్రం కలసి నడుస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వద్దు ప్యాకేజీ చాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారని సోమువీర్రాజు స్పష్టం చేశారు. చంద్రబాబు అమరావతిలో తాత్కాలిక రాజధాని నిర్మించారని ఆరోపించారు. బాబు పాలనలో సోమవారం పోలవరం అని కాలక్షేపం చేశారన్నారు.

వీసీలతో గవర్నర్ సమావేశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూనివర్సిటీల ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ సోమవారం వైస్‌ఛాన్స్‌లర్లు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ నుంచి పీయూలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గవర్నర్ ఆరా తీశారు. వీటితో పాటు అకాడమిక్ పరమైన అంశాలు, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న పలు సేవాకార్యక్రమాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ అధికారులు ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరాలు అందజేశారు. ఈమేరకు యూనివర్సిటీలో వసతుల కల్పన, విద్యార్థుల అవసరాలు తదితర అంశాలపై వివరించారు. అధికారులు అందజేసిన వివరాలపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్లు అధికారులు, పీయూ నుంచి వీసీతో పాటు వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటధ్వంసం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

గద్వాల క్రైం: పొలంలో పంటను ధ్వంసం చేసిన కేసులో ఇద్దరికి రెండు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్ నాయక్ తీర్పు వెల్లడించారని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెచ్చల్ సంజన జాషువా తెలిపారు. గద్వాల మండలం ఆనంతపురం గ్రామానికి చెందిన ఇంతియాజ్‌కు ధరూరు మండలంలో వ్యవసాయ పొలం ఉంది. అందులో ఆముదం పంట సాగు చేసుకున్నాడు. అయితే ధరూరు మండలానికి చెందిన తిరుపతయ్య గౌడ్, కావలి ఆంజనేయులు 2017లో పంటను ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై ధరూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సోమవారం కోర్టులో ఇరువురి వాదనలు, సాక్షుల వాంగ్మూలం విన్న అనంతరం న్యాయమూర్తి నిందితులకు రెండు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.500ల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని పేర్కొన్నారు.

ఖాళీ స్థలాలపై రియల్ కన్ను



అమరచింతలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

- గుడిసెల పోరుయాత్రలో కన్వీనర్ వీరయ్య

అమరచింత: రాష్ట్రంలో ఖాళీ జాగల కోసం రియల్ వ్యాపారులు ప్రభుత్వంతో కుమ్మక్కై ఉన్న స్థలాలను కాజేస్తున్నారని రియల్ భూతాలను ప్రభుత్వం పరోక్షంగా ప్రోత్సహిస్తుందని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ వీరయ్య అన్నారు. గతేడాది నుంచి ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వంతో పోరాడుతున్న నిరుపేదలు ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకుని ఆందోళన చేస్తున్నా సీఎం కేసీఆర్ మౌనంగా ఉండటం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంఘాల బస్సు యాత్ర సోమవారం అమరచింతకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక దుంపాయి కుంటలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న పేదలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది నుంచి రాష్ట్రంలోని 23 జిల్లాలు 64 ప్రాంతాల్లో నిరుపేదలు ఇంటి స్థలాల కోసం రోడ్డెక్కారన్నారు. డబుల్ బెడ్‌రూంలు నిర్మించి ఇస్తామన్నా ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చిందని గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షలు ఇస్తామని చెప్పుకోవడం తగదన్నారు. డబుల్‌బెడ్‌రూం నిర్మాణానికి రూ.5–7 లక్షల ఖర్చు వచ్చిందని చెబుతున్న ప్రభుత్వం రూ.3 లక్షలకే ఇంటిని ఎలా నిర్మించుకుంటారని ప్రశ్నించారు. అమరచింతలో గుడిసెల పోరు చేపట్టి పది నెలలు గడుస్తున్నా స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ సందర్శించకపోవడం సరికాదన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం కాపాడతానని ప్రకటించిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు మహిళలు సొంత ఇళ్లు లేక గుడిసెలు వేసుకొని ఇంటి స్థలాలు కావాలని ఆందోళన చేస్తున్నారని అలాంటి వారిపై పోలీసులతో దాడులు చేయించడం తగదన్నారు. నిరుపేదలకు ఇంటిస్థలాలతోపాటు ఇంటి నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్రం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాత్రికి అక్కడే వంటా వార్పు చేపట్టి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, ప్రజా సంఘాల వెంకట్రాములు, సైకిలాబ్ బాబు, ఆశయ్య, జంగారెడ్డి, రమేష్, వెంకటేష్, ఆనంద్, ముత్యాలు, జగదీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ



మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త అనిత

మదనాపురం: మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళా రైతులకు శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తయారీ విధానం, చిరుధాన్యాలతో లాభాలు, వాటి విశిష్టత, ఆరోగ్య లాభాలు, తదితర అంశాలను కూలంకశంగా వివరించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన విలువ ఆధారిత ఉత్పత్తుల కోసం ప్రభుత్వాలు ఎంతగానో సహకరిస్తున్నాయని, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు డ్రోన్ మేళా

వ్యవసాయ శాఖ, కేవీకే సంయుక్తంగా నిర్వహిస్తున్న డ్రోన్ మేళా, వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన మంగళవారం స్థానిక రైతువేదిక ప్రాంగణంలో నిర్వహిస్తామని కేవీకే శాస్త్రవేత్త మస్తానయ్య తెలిపారు. ఆయా గ్రామాల రైతులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అవినీతి ఆలకు పాలించే అర్హత లేదు



మాట్లాడుతున్న రాచాల యుగందర్‌గౌడ్

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగందర్‌గౌడ్

కొత్తకోట: దేవరకద్ర నియోజకవర్గంలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి పాలించే అర్హత లేదని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగందర్‌గౌడ్ అన్నారు. సోమవారం కొత్తకోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యంత అసమర్థ, అవినీతిపరుడు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అని, సొంత ఆస్తులు పెంచుకోవడం తప్ప నియోజకవర్గ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కూడా ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఒక్క డిగ్రీ కళాశాల, 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. గడిచిన తొమ్మిదేళ్లలో కానాయిపల్లి శంకరసముద్రం భూ నిర్వాసితుల సమస్యలు, ఊకచెట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణం, రోడ్ల విస్తరణ, మినీ స్టేడియం, కొత్త మండలాల్లో జూనియర్ కళాశాలల ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కర్వెన ప్రాజెక్టు కాంట్రాక్టర్, ఇసుక, మట్టి దందా, భూ కబ్జాలకు తెరలేపారని దుయ్యబట్టారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వకపోవడం దురదృష్టకరం అన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం చేసిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారన్నారు. రెండుసార్లు గెలిచి అభివృద్ధి చేయని ఎమ్మెల్యే ఆల హటావో.. దేవరకద్ర బచావో అని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు అంజన్నయాదవ్, మహేందర్, శేఖర్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపకులాలకు 40శాతం దళితబంధు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎస్సీల్లో కేవలం రెండు కులాలు మాత్రమే దళితబంధు పథకాన్ని లబ్ధిపొందుతున్నాయని మిగిలిన 40 శాతం ఎస్సీ ఉప కులాలకు దళితబంధు అమలు చేయాలని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వెంకటేశం అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలోని 59 కులాల్లో కేవలం రెండు కులాలు లబ్ధి పొందుతుండగా.. మిగతా 57 కులాలకు దళితబంధు అందడం లేదన్నారు. ప్రధానంగా మోచి హోలియదాసరి, చిందు, డక్కలి, మాష్టిన్, గోసంగి, మాలజంగం, మాలదాసరి, బైండ్ల, మాదసి కురువ, గోసంగి, సమగర, బేడబుడగ జంగం, మాంగ్, మహార్, మిత, అయ్యాల్వార్ తదితర వారికి ఒక్క శాతం కూడా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొండయ్య, ఉపాధ్యక్షుడు మధు, ఆంజనేయులు, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి లేదు

మన్ననూర్: ఈ నెల 29న ఏకాదశి పండగకు లొద్ది మల్లయ్య ఆలయానికి అనుమతులు లేవని ఎఫ్ఆర్ఓ రాజేందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో నల్లమల ప్రాంతంలోని ప్రకృతి రమణీయ ప్రదేశాలైన లొద్ది మల్లయ్య, మల్లెల తీర్థం, ఆక్టోపస్ వ్యూతో పాటు శివాలయాలు, వాటర్ ఫాల్స్ ప్రాంతాలను సందర్శించడం ఆనవాతిగా వస్తుంది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు వన్యప్రాణులు ముఖ్యంగా పెద్ద పులులు, చిరుత పులుల కలయికలు జరిగే రోజులు కావడంతో అభయారణ్యం, లొద్ది మల్లయ్య వాటర్ ఫాల్స్ వద్దకు వెళ్లేందుకు అనుమతులు రద్దు చేసినట్లు తెలిపారు. అనుమతులు ఉన్నట్లు అనధికార వ్యక్తులు చెప్పే తప్పుడు మాటలు నమ్మవద్దని కోరారు.

దర్శనానికి అనుమతించాలని వినతి

అచ్చంపేట రూరల్: తెలంగాణ అమర్నాథ్‌గా పేరుగాంచిన బల్మూర్ మండలం కొంగనాగుల సమీపంలో ఉన్న లొద్ది మల్లయ్య పుణ్యక్షేత్రంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు దర్శించుకునేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ భజరంగ్ దళ్ నాయకులు సోమవారం డీఎఫ్ఓ కార్యాలయంలో అధికారి రామస్వామికి వినతిపత్రం అందజేశారు. కరోనా కారణంగా గత రెండేళ్లుగా అటవీ శాఖ దర్శనాలను నిలిపివేసిందని భజరంగ్ దళ్ అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు శివచంద్ర చెప్పారు. గురువారం తొలి ఏకాదశి ఉందని, ఈసారి అనుమతులు ఇచ్చి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ నాయకులు చందులాల్ చౌహాన్, ఆంజనేయులు, రమేష్, శరత్‌చంద్ర, అఖిలేష్, శివాజీ, నరేష్, శరత్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



డీఎఫ్ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న భజరంగ్ దళ్ నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ రూరల్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లాలోని చైల్డ్ హెల్ప్‌లైన్ (డీసీపీయూ) మిషన్ వాత్సల్య పథకం ద్వారా 4 రకాల 8 పోస్టులకు పొరుగు సేవల ప్రాతిపదికన ఉద్యోగ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం నుంచి వచ్చే నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు అన్ని ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను గజిటెడ్ అధికారి, లేదా సెల్ఫ్ అటేస్టేషన్ చేసి కలెక్టరేట్‌లోని మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తులు https://mahabubnagar.telangana.gov.in/recruitments/ ద్వారా ఆన్‌లైన్‌లో లభిస్తుందని చెప్పారు.

హైకోర్టు జడ్జిని కలిసిన గద్వాల న్యాయవాదులు

గద్వాల రూరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టులను భర్తీ చేయాలని గద్వాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఆదిమల్లారెడ్డి, న్యాయవాదులు హైకోర్టు జడ్జి, పోర్ట్‌పోలియో జడ్జి సూర్యపల్లి నందను కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గద్వాల కోర్టులోని పలు సమస్యలను, న్యాయవాదుల సమస్యలను తెలిపారు. ఇదే క్రమంలో ఇది వరకే ఇచ్చిన వినతిపై సానుకూలంగా స్పందించి జిల్లా జడ్జి ని నియమించినట్లు బార్ అసిసోయేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యదర్శి ఆదిమల్లారెడ్డి, న్యాయవాదులు జయసింహారెడ్డి, ఇస్మాయిల్, నర్సింహులు, విజయ్‌కుమార్, గజేందర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జిని కలిసిన గద్వాల న్యాయవాదులు